ప్రజలకు అన్నీ శుభాలు కలగాలి



బీజేపీ ఎన్నికల ప్రచార రథాలను ప్రారంభించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ: ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయం వద్ద పార్టీ ఎన్నికల ప్రచార రథాలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రోధినామ సంవత్సరంలో ప్రజలకు అన్నీ శుభాలు, విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. సమృద్ధిగా వానలు కురవాలని, పంటలు బాగా పండాలని, రైతులు, ప్రజలకు మేలు కలగాని కోరుకున్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండోసారి బీజేపీ విజయం సాధించేలా కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు మాట్లాడుతూ.. మే 13 వరకు పార్టీ నేతలు, కార్యకర్తలంతా ప్రజల మధ్యలోనే ఉండి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధించేలా ప్రచారం చేపట్టాలని సూచించారు. పార్టీ నేతలు చింతల రాంచంద్రారెడ్డి, శ్యామ్‌సుందర్‌గౌడ్, శ్రీనివాస్, వీరెల్లి చంద్రశేఖర్, రాజశేఖర్‌రెడ్డి, కేశబోయిన శ్రీధర్ తదితరులున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి



ఉగాది వేడుకల్లో ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్

బీజేపీ రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌లు అన్నారు. క్రోధి నామ ఉగాది పండుగ రాష్ట్ర ప్రజల్లో సుఖసంతోషాలు నింపాలన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ అనంతచార్యులచే పంచాంగ పఠనం నిర్వహించి ఉగాది పచ్చడి, బొబ్బట్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ.. వాకర్స్ క్లబ్ అధ్యక్షులు రూపుల వివేక్, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామిగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సినీనటులు కళ్యాణ మాధవి, హిమవర్ష, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రేటర్ నాయకులు ఎంఎన్ శ్రీనివాసరావు, యువజన నాయకులు ముఠా జైసింహ, పి.వి.నిరంజన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, సంతోష్‌గౌడ్, క్లబ్ మాజీ అధ్యక్షులు బబ్లూ, నాగభూషణం, మురళీకృష్ణ, సంపత్‌రెడ్డి, క్లబ్ కోశాధికారి సిరిగిరి కిరణ్, శ్రీను, కల్యాణ్‌నాయక్, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

రాంజీ గోండు స్ఫూర్తితో పోరాడతాం



నివాళులర్పిస్తున్న రవికుమార్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆదివాసీ విధానాలపై రాంజీ గొండు స్ఫూర్తితో పోరాడుదామని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఉపాధ్యక్షులు బండారు రవికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సామాజిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాంజీ గొండు 164వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు సింహ స్వప్నంగా ఆదివాసీ పోరాటాలు జరిగాయన్నారు. రాంజీగొండు సంతులాల్ తిరుగుబాటు ప్రజల్లో ఉత్సాహాన్ని నింపిందని కొనియాడారు. గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరామ్‌నాయక్, వివిధ సంఘాల నాయకులు ఎం.వీ.రమణ, ఆశయ్య, నరేష్, సైకిలాబ్‌బాబు, జాన్‌వేస్లీ, మూడ్ శోభన్‌నాయక్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం



పంచాంగ శ్రవణం చేస్తున్న ఆచార్య పార్థసారథి

కవాడిగూడ: ఇందిరాపార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రోధినామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణ వేడుకలు నిర్వహించారు. ఆచార్య పార్థసారథి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఇందిరా పార్కులో వాకింగ్‌కు వచ్చిన వాకర్స్, సందర్శకులకు పంచాంగ శ్రవణం వినిపించారు. ఈ కార్యక్రమంలో ఇందిపార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎ. సుధాకర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు ఎం.శ్రీనివాస్‌ముదిరాజ్, ప్రభాకర్‌యాదవ్, శ్రీనివాస్, నరేందర్, టికెఎం రెడ్డి, తిరుపతిరెడ్డి, కృష్ణ, శేరుపల్లి గణేష్, గాజుల కృష్ణతో పాటు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం వాకర్స్‌కు ఉగాది పచ్చడి, బొప్పట్లను పంపిణీ చేశారు. కొటకిటలాడిన ఆలయాలు.. క్రోధినామ సంవత్సర ఉగాది పండగను పురస్కరించుకుని మంగళవారం ఉదయం నుంచే కవాడిగూడ డివిజన్‌లోని పలు దేవాలయాల్లో తెల్లవారు జాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డివిజన్‌లోని బాలాంజనేయస్వామి దేవాలయం, సంకట విమోచన దేవాలయం, లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కట్టమైసమ్మ దేవాలయం, లోయర్ ట్యాంక్‌బండ్‌లోని జగదీష్ మందిర్, శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయం, దోమలగూడలోని హనుమాన్ దేవాలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు తగిన చర్యలు తీసుకున్నారు.

బీజేపీ బలోపేతానికి ఆలె నరేంద్ర సేవలు చిరస్మరణీయం



ఆలే నరేంద్ర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్



నివాళులర్పిస్తున్న వినయ్‌కుమార్, ఉమేష్

అంబర్‌పేట: రాష్ట్రంలో బీజేపీ బలపడటంలో దివంగత నేత ఆలె నరేంద్ర చేసిన కృషి చిరస్మరణీయమని బీజేపీ ఓబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌గౌడ్ అన్నారు. మంగళవారం అంబర్‌పేట డివిజన్ పటేల్ నగర్‌లో నరేంద్ర 10వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ పటిష్టానికి కృషి చేసిన వారిలో ఆలె నరేంద్ర ఒకరని ఆయన అన్నారు. ప్రధానంగా నగరంలో ఎంఐఎం వంటి పార్టీలను ఎదుర్కొంటూ.. కార్యకర్తలకు ప్రతి అంశంలో అండగా ఉంటూ.. ఎంతో పోరాట పటిమ ప్రదర్శించారన్నారు. శాసన సభ్యుడిగా ఆయన పేదలకు ఎంతో చేయూతనిచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీజేపీ నేతలు నాగభూషణంచారి, కృష్ణ ముదిరాజ్, భిక్షపతి, రాజేష్‌కుమార్, మల్లేష్, యశ్వంత్, దయాకర్‌యాదవ్, గణేష్, వెంకటేష్‌గౌడ్ తదితరులున్నారు.

హిందూ వ్యతిరేకులపై పోరాడిన యోధుడు..

చిక్కడపల్లి: హిందూ వ్యతిరేకులపై జీవితాంతం పోరాడిన యోధుడు టైగర్ నరేంద్ర అని సికింద్రాబాద్ లోక్‌సభ నియోజవర్గ బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ అన్నారు. కేంద్రమాజీ మంత్రి టైగర్ ఆలె నరేంద్ర వర్ధంతి సందర్భంగా మంగళవారం గాంధీనగర్ కార్పొరేటర్ కార్యాలయంలో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వినయ్ పాల్గొని నరేంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. హిందూ సామ్రాట్, ఎంఐఎం నాయకులు పాలిట సింహ స్వప్నం, హైదరాబాద్ కా షేర్, తెలంగాణ కోసం జీవితాంతం పోరాడిన నాయకుడు టైగర్ నరేంద్ర అని కొనియాడారు.

● 1975లోఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఉద్యమించి 18 నెలల పాటు జైలు జీవితాన్ని అనుభవించిన నేత అన్నారు. ఆయన ఆశయ సాధనకోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. ఓబీసీ మోర్చా ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ ఉమేష్, సీనియర్ నాయకులు రాజాగౌడ్, శ్రీకాంత్, వీఎస్టీ రాజు, నర్సింహ, దోనేటి సత్యం, భారత్, హన్మంతు, యాదగిరి, శ్రీనివాస్‌గౌడ్, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొని నరేంద్రకు నివాళులర్పించారు.

ఆలయాల్లో ఉగాది వేడుకలు

భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ పంచాంగ శ్రవణం చేసిన పండితులు



న్యూ నల్లకుంటలో..



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

నల్లకుంట: తెలుగు ప్రజల నూతన సంవత్సరం క్రోధినామ ఉగాది సందర్భంగా నల్లకుంటలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరమఠం, న్యూ రామాలయం, పాత రామాలయం, లింగాల గడ్డ శివాలయం, బాగ్‌అంబర్‌పేట్‌లోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

మైసమ్మ ఆలయంలో..

అంబర్‌పేట: ఉగాది వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. మంగళవారం అంబర్‌పేట నియోజకవర్గ వ్యాప్తంగా ఉగాది పర్వదినం సందర్భంగా పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీ క్రోధినామ సంవత్సర పంచాంగ శ్రవణాన్ని ఆలకించి భక్తులు సందడి చేశారు. షడ్రుచులతో ఉగాది పచ్చడిని స్వీకరించి తెలుగు కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు.

ఆలయాల్లో పంచాగ శ్రవణాలు..

చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని స్వయాంభువుగా వెలసిన ఆంజనేయస్వామి ఆలయం, ఆర్టీసీక్రాస్‌రోడ్డులోని ప్రసిద్ధి చెందిన లక్ష్మీగణపతి ఆలయం, జవహర్‌నగర్‌లోని శ్రీలలితాపరమేశ్వరి ఆలయం, వివేక్‌నగర్‌లోని దుర్గ నల్లపోచమ్మ దేవాలయం, క్రాస్‌రోడ్డులోని శృంగేరి శారదపీఠం శ్రీ పంచముఖి ఆంజనేయస్వామి, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో క్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓలు మాచర్ల దేవనాథం, పాశం లక్ష్మారెడ్డి, ప్రధాన అర్చకులు బుగ్గలక్ష్మీపతిశర్మ, కాశీనాథ్‌శర్మ, వెంకటాద్రి, కృష్ణమూర్తి, జగన్మోహనాచారి, గోపాలాచారి, బుచ్చమచారి తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మకుంటలోని మైసమ్మ ఆలయంలో..



ముఖ్య అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మను సన్మానిస్తున్న దృశ్యం

ఇఫ్తార్ విందు



బీఆర్ఎస్ సికింద్రాబాద్ అభ్యర్థి పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: అంబర్‌పేట క్రౌన్ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. మంగళవారం రాత్రి నిర్వహించిన విందులో బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి, ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ పాల్గొని ముస్లింలకు పండ్లు తినిపించి ఉపవాస దీక్షలను విరమింపజేశారు. అనంతరం ఆయన వారికి ముందస్తుగా ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి మహమూద్‌అలీ, కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, పద్మావెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియామకం



మహేష్‌కుమార్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న డాక్టర్ కె.లక్ష్మణ్

ముషీరాబాద్: భోలక్‌పూర్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు మహేష్‌కుమార్ ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. మంగళవారం ఆయనను ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల మద్దతు బీజేపీకే ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని పార్లమెంటు స్థానాలను బీజేపీ కై వసం చేసుకోవడంతో పాటు కేంద్రంలో మరోసారి ప్రధాని మోదీ సారథ్యంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మహేష్‌కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు డాక్టర్ కె.లక్ష్మణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

17న శ్రీరామ నవమి శోభాయాత్ర

అబిడ్స్: భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో భారీ ఎత్తున శ్రీరామ నవమి శోభాయాత్ర నిర్వహిస్తామని నిర్వాహకులు గోవింద్‌రాఠి, మెట్టు వైకుంఠం, శ్రీరామ్ వ్యాస్, మహేందర్ వ్యాస్ వెల్లడించారు. 17న శ్రీరామ నవమిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కన్నుల పండువగా శోభాయాత్ర చేపడుతామన్నారు. కార్పొరేటర్లు శంకర్‌యాదవ్, లాల్‌సింగ్, బీజేపీ అభ్యర్థి మాధవీలత, మోహన్‌గుప్తా, నారాయణ్‌సర్దా, కరోడిమాల్ నర్సింగ్ పూర్యాలతో కలిసి సిద్దిఅంబర్‌బజార్ బహేతిభవన్‌లో భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ..లక్షలాది మంది రామ భక్తులతో 17న సీతారామ్‌బాగ్ సీతారామ ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభించిన గోవింద్‌రాఠి, మెట్టు వైకుంఠం తదితరులు

మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవం



స్వామివారి కల్యాణోత్సవంలో డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ రోహిణ్‌రెడ్డి

కాచిగూడ: వీరన్నగుట్ట శ్యామ్‌మందిర్, వీరభద్రస్వామి దేవాలయ ప్రాంగణంలో మంగళవారం రాత్రి శ్రీ మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాదేవి పూజ, వీరభద్రస్వామి గొలుసు తెంపుట, మల్లికార్జునస్వామి ఊరేగింపు జరిగింది. కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రోహిణ్‌రెడ్డి, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి



ఓంనగర్‌లో బీజేపీ జెండాను ఆవిష్కరించిన పీఎన్.చారి తదితరులు

కవాడిగూడ: బీజేపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి మూడోసారి బీజేపీకి ఓటు వేసి నరేంద్రమోది హ్యాట్రిక్ సాధించేలా నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కవాడిగూడ డివిజన్ బూత్ నెంబర్ 65 బూత్ కో-ఆర్డినేటర్ పీ.ఎన్ చారి పిలుపునిచ్చారు. బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బూత్‌నెంబర్ 65లో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను బీజేపీ నాయకులు వెంకటేష్, పార్టీ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎంసీ.మహేందర్‌బాబు హాజరై పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను బీజేపీ నేతలు కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు పాటుపడాలని వారు సూచించారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా.. దేశంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చి మోదీ ప్రధానిగా హ్యాట్రిక్ సాధించడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. బూత్ కమిటీ సభ్యులు సత్తయ్య, శంకర్‌తో పాటు బీజేపీ నేతలు కార్యకర్తలు బస్తీవాసులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నేత



కె.కృష్ణను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: గోల్నాకకు చెందిన కె.కృష్ణ బీఆర్ఎస్ పార్టీ నుంచి బీజేపీలో చేరారు. మంగళవారం బీజేపీ గోల్నాక డివిజన్ అధ్యక్షులు మూల రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆయన కేంద్రమంత్రి సమక్షంలో పార్టీలో చేరారు. బీజేపీ పార్టీలో ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం ఉంటుందని కేంద్రమంత్రి, సికింద్రాబాద్ పార్లమెంటు అభ్యర్థి కిషన్‌రెడ్డి తెలిపారు. గతంలో బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి వెళ్లిన ఆయన తిరిగి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీని వీడిన ప్రతి ఒక్కరూ తిరిగి పార్టీలోకి రావాలని పిలుపునిచ్చారు. బీజేపీ నాయకులు కేసరి నర్సింగ్‌రావుయాదవ్, రమేష్, రవీందర్ తదితరులున్నారు.

ఆన్‌లైన్ మనీ ట్రాన్స్‌ఫర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ జగన్

లాలాపేట: పెట్రోల్ బంకులే టార్గెట్ చేసుకుని ఫోన్‌పే, గూగుల్ పే మనీ ట్రాన్స్‌ఫర్ పేరుతో దోపిడీలకు పాల్పడుతున్న నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉస్మానియా యూనివర్సిటీ ఏసీపీ జగన్ సూచిస్తున్నారు. ఇదే తరహా ఇటీవల ఓయూ పోలీసు స్టేషన్ పరిధిలోని తార్నాకలో చోటు చేసుకున్న సంఘటన వివరాలను మంగళవారం ఆయన వివరించారు. షాపూర్‌నగర్, కత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన ఎండీ సబీల్(33) చెడు వ్యసనాలు జూదం, మద్యానికి బానిసై సులువుగా డబ్బులు సంపాదించేందుకు దొంగతనాలను ఎంచుకున్నాడు. ఈ నెల 5న రాత్రి 8 గంటల ప్రాంతంలో తార్నాకలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌కు హడావుడిగా వచ్చాడు. తాను అత్యవసర పరిస్థితిలో ఉన్నాను తన వద్ద రూ. 20 వేల నగదు ఉంది అది మీకు ఇస్తాను ఫోన్‌పే నెంబర్‌కు పంపితే మీకు కమీషన్ ఇస్తానని నమ్మబలికాడు. కమీషన్ కోసం ఆశపడ్డ బంక్ ఉద్యోగి సుమిత్ రాయ్(28) ఆ దుండగుడు ఇచ్చిన సెల్ నెంబర్‌పై ఫోన్ పే ద్వారా రూ.20 వేలు పంపాడు. ఇంతలో ఆ నగదు ఇవ్వకుండానే అతడు పారిపోవడంతో సుమీత్ రాయ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు హబ్సిగూడ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఓయూ పోలీసులు పట్టుకుని పీఎస్‌కు తీసుకెళ్లి విచారించగా నేరం ఒప్పుకోవడంతో రిమాండ్‌కు తరలించారు.

లష్కర్‌లో బీఆర్ఎస్‌దే విజయం

అబిడ్స్: సికింద్రాబాద్ పార్లమెంటు నుంచి బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మంగళవారం బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను ఆయన కలిసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. నాంపల్లి నియోజకవర్గంలో కూడా అత్యధిక ఓట్లు పోలయ్యేలా కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వ లబ్ధిదారులంతా పద్మారావుగౌడ్‌ను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు.

సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

కాచిగూడ: రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్న 8 లక్షల మంది విద్యార్థుల మెస్ బిల్లు సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సత్వరమే చెల్లించి విద్యార్థుల ఉన్నత చదువులకు బాటలు వేయాలని బీసీ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సైతం విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. విద్యార్థులు ఆకలి కేకలతో అలమటిస్తున్నా.. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. హాస్టల్స్ మెస్ బిల్లులు, భవనాల అద్దె బిల్లులు చెల్లించకపోవడంతో హాస్టళ్లు మూతపడే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పేద విద్యార్థులు విద్యకు దూరమవుతారని, దీనివల్ల ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి హాస్టళ్ల మెస్ బిల్లులు, హాస్టళ్ల భవనాల అద్దె బిల్లులు చెల్లించాలని కోరారు. పెండింగ్ బకాయి బిల్లులు చెల్లించపోతే జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్ఆర్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్ విద్యార్థులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

డీసీసీ ప్రధాన కార్యదర్శిగా గోవర్ధన్‌రెడ్డి



నల్లకుంట: ఖైరతాబాద్ డీసీసీ ప్రధాన కార్యదర్శిగా కందగట్ల గోవర్ధన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డి ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రోహిణ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, సోనియాగాంధీ, దీప్‌దాస్ మున్షి, సీఎం రేవంత్‌రెడ్డి, బట్టి విక్రమార్క తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

ఘనంగా కేశవ్‌రావ్ బలిరాం పంత్ హెగ్డేవార్ జయంతి



హెగ్డేవార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వ్యవస్థాపకులు కేశవ్ బలిరాం పంత్ హెగ్డేవార్ జయంతి వేడుకలను మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని ఎలైట్ డ్రైవింగ్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెగ్డేవార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ డైరెక్టర్ కె.ఉపేందర్ మాట్లాడుతూ.. హిందుత్వ బావజాలాలను వ్యాప్తి చేయడానికి హెగ్డే వార్ ఆర్ఎస్ఎస్‌ను మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో స్థాపించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేశవ స్మృతి సంవర్ధన సమితి అధ్యక్షులు కృష్ణారెడ్డి, కోశాధికారి రాంచందర్, ప్రధాన కార్యదర్శి బాలయ్య తదితరులున్నారు.

పంచాంగం- 2024 ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న టీబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు

నల్లకుంట: తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్ఎస్) ఆధ్వర్యంలో మంగళవారం నల్లకుంటలో శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉగాది పంచాంగం-2024 ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన టీబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు తెలుగు నూతన సంవత్సర పంచాంగం పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. టీబీఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవులపల్లి రంగారావు, ఆర్‌కే. దేశ్‌ముఖ్, ప్రధాన కార్యదర్శి మంత్రి సునీల్, జిల్లా సహాయ కార్యదర్శి దేవులపల్లి అశోక్‌కుమార్, కేవీ ఎస్‌మూర్తి, ఎస్‌డీశర్మ, కేవీఆర్‌రావు, శివకుమార్, విజయ్‌కుమార్, మంత్రి లీలాబాయి తదితరులున్నారు.

రంజాన్, శ్రీరామనవమికి బందోబస్తు ఏర్పాటు

ఈస్ట్‌జోన్ డీసీపీ ఆర్.గిరిధర్



హిమాయత్‌నగర్: ప్రజలు ప్రశాంత వాతావరణంలో రంజాన్, శ్రీరామనవమి పర్వదినాలను జరుపుకోవాలని నగర ఈస్ట్ జోన్ డీసీపీ ఆర్.గిరిధర్ కోరారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శ్రీరామ నవమి శోభయాత్రపై నిర్వాహకులతోపాటు అన్ని ప్రభుత్వ విభాగాలతో సమన్వయ సమావేశం నిర్వహిస్తామన్నారు. పీస్ కమిటీ సమావేశాలు నిర్వింహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఎన్నికల కోడ్ కూడా ఉన్న నేపథ్యంలో అన్ని రకాల భద్రతాచర్యలు కట్టుదిట్టంగా ఏర్పాటు చేశామని డీసీపీ తెలిపారు.

'ప్రధానిగా మోదీ హ్యాట్రిక్ ఖాయం'

హిమాయత్‌నగర్: కేంద్రంలో బీజేపీ మరోసారి విజయం సాధించి, నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని, ఉగాది పంచాంగంలో వేదపండితులు ఇదే విషయాన్ని స్పష్టం చేశారని ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ అన్నారు. ఉగాది పండుగ ప్రతి ఒక్కరి ఇంటిలో వెలుగులను నింపాలని ఆకాంక్షించారు. మంగళవారం జరిగిన హియాయత్ నగర్ డివిజన్‌లోని 18వ బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మరోసారి సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ గెలిచేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని, ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలని అన్నారు. ఈ సమావేశంలో బూత్ కమిటీ అధ్యక్షులు తుల్జా రామ్, శ్రీశైలం, రమేష్, రాజు, కార్తీక్, భరత్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్ర సంఘం అధ్యక్షుడిగా లక్ష్మణ్

యాకుత్‌పురా: సుల్తాన్‌షాహి గాంధీపురా గంగపుత్ర సంఘం నూతన కార్యవర్గ సభ్యులను మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పల్లేల లక్ష్మణ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా భిక్షపతి, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శులుగా కిషోర్, గంగనామోని గజనంద్, కోశాధికారిగా ముచ్చటి ధన్‌రాజ్, కోటగిరి శ్రీనివాస్, ముఖ్య సలహాదారులుగా చర్మానీ రూప్‌రాజ్, మోకాళ్ల వెంకటేష్‌లను ఎన్నుకున్నారు.